సాక్షి
నంద్యాల
మంగళవారం ; 27 ; జూన్ ; 2023



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ చేపట్టారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించిన అనంతరం వెండిరథోత్సవం నిర్వహించారు.



టమాట కొరత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో టమాట కొరత ఏర్పడింది. కర్నూలు రైతు బజార్‌లో కిలో ధర రూ. 80 ఉండటం గమనార్హం. ఇక బయట మార్కెట్‌లో రూ. 100 వరకు విక్రయిస్తున్నారు.



మోస్తరు వర్షాలు

నంద్యాల(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నంద్యాల జిల్లాలో 7.4 మి.మీ వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పాఠశాల వేళలు తప్పక పాటించాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు అన్ని యాజమాన్య పాఠశాలలు రెండు పూటలా తరగతులు నిర్వహించాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 3.30 గంటల వరకు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు 4 గంటల వరకు నిర్వహించాలన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడో కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 273 మంది విద్యార్థులకు గాను 246 మంది (90 శాతం) హాజరయ్యారన్నారు. అలాగే మరో మూడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 266 మంది విద్యార్థులకు గాను 234 మంది (88 శాతం) హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారన్నారు.

సంగమేశ్వరుడికి ఆషాఢమాస పూజలు



వేపదారు శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

కొత్తపల్లి: సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయంలో సంగమేశ్వరుడికి సోమవారం భక్తులు ఆషాఢమాస పూజలు చేశారు. సంగమేశ్వరుడికి నదిజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన భక్తులు వేపదారు శివలింగానికి భక్తిశ్రద్ధలతో అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

నంద్యాల: జిల్లాలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరుతోపాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్యలు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వీసెస్‌కు సంబంధించిన సర్వే మంగళవారం మధ్యాహ్నంలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సర్వేలో వచ్చిన సర్వీస్ రిక్వెస్ట్‌లు పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ వేర్వేరు లాగిన్‌లలో నమోదై సర్వీస్ టోకెన్ జెనరేట్ ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి వారం రోజుల్లో విచారించి సంబంధిత సర్వీస్ రిక్వెస్ట్‌ల ధ్రువ పత్రాలు జారీ చేయాలన్నారు. జిల్లా అధికారులను నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లుగా నియామకం చేశామని, మండలాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమం అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. స్పందనలో వచ్చిన 225 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మాదకద్రవ్యాల జోలికెళ్తే పీడీయాక్ట్



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు, తదితరులు

బొమ్మలసత్రం: మాదకద్రవ్యాల జోలికెళ్లినా, వాటి ని సరఫరా చేసినా పీడీయాక్ట్ నమోదు చేస్తామని అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు హెచ్చరించారు. సోమవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నుంచి శ్రీనివాససెంటర్ వరకు విద్యార్థుల తో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు అంధకారంలోకి నెడుతుందన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే 9154987020కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సెబ్ డీఎస్పీ శ్రీధర్‌రావు, సీఐలు ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు, రామకృష్ణ, రవీంద్ర, ఎస్‌ఐ సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా ఉంది నిమ్మ రైతుల పరిస్థితి. దళారుల చేతివాటంతో ఏటా నష్టపోతున్నారు. జిల్లాలో సాగు చేసే నిమ్మకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా రైతు మాత్రం ఆశించిన లాభాలు పొందలేక పోతున్నాడు. ఉమ్మడి జిల్లాలో నిమ్మ విక్రయాలకు మార్కెట్ లేకపోవడమే ఇందుకు కారణం. ఏటా నిమ్మ సాగు విస్తీర్ణం పెరుగుతున్నా మార్కెట్ సౌకర్యం లేక రైతులు దిగాలు చెందుతున్నారు.



రైతుకు పుల్లన.. దళారీకి తీయన

- నిమ్మ సాగుదారులతో దళారుల దోబూచులాట
- బస్తా రూ. 1,000కి పడిపోయిన ధర
- ఆళ్లగడ్డలో ప్రైవేటు మార్కెట్ మాయాజాలం
- దిగుబడి పెరిగితే ధర నేల చూపే
- ఉమ్మడి జిల్లాలో నిమ్మ మార్కెట్ లేక దిగాలు



నిమ్మకాయలు వేలంపాటలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పాతికేళ్ల అనుభవం ఉన్న రైతు కూడా నిమ్మకు ఎప్పుడు ఎంత ధర ఉంటుందో చెప్పలేని దయనీయ పరిస్థితి నెలకొంది. కారణం ఇక్కడ ధర నిర్ణయించేది దళారులు మాత్రమే.. గిరాకీ లేదని, దేశంలో ఎక్కడ చూసినా నిమ్మ పంట విపరీతంగా మార్కెట్‌కు వస్తోందని.. ఇలా సాకులు చూపి... దళారులు నిమ్మ సాగుదారులను నట్టేట ముంచుతున్నారు. జిల్లాలో పండే నిమ్మకు కర్ణాటక, తమిళనాడు, హైదరాబాద్, కోల్‌కతా, ఢిల్లీలతోపాటు నేపాల్, అరబ్ దేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉన్నా.. ప్రస్తుతం మార్కెట్ పూర్తిగా పడిపోయిందంటూ రైతులను నిలువు దోపిడీకి గురిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అధికారికంగా నిమ్మ మార్కెట్ లేకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 4,500 హెక్టార్లలో నిమ్మ సాగు విస్తరించగా ఇందులో సుమారు 2,500 ఎకరాలకు పైగా ఒక్క ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సాగవుతోంది. ఏటా సెప్టెంబర్ నుంచి మే, జూలై మాసాల వరకు బస్తా (400 కాయలు) మొదటి రకం అయితే రూ.6,500 నుంచి రూ.7,500, రెండో రకం అయితే రూ.5,000 నుంచి రూ.6,000, చివరి రకం అయితే రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలికేది. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో ధర ఆశాజనకంగానే ఉన్నప్పటికీ కొనుగోలు దారులు లేక 'దళారులు పాడిందే పాట.. రాసిందే ధర' అన్నట్లు నడుస్తుండటంతో రెండు నెలల నుంచి బస్తా రూ.1,000 నుంచి రూ.1,400కే విక్రయించాల్సి వస్తోంది. దీంతో ఒక్కో రైతు ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. మొత్తం పంట దిగుబడిని చూస్తే ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో ఈ సీజన్‌లో రూ. కోట్లలో నష్టం ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు వంద సంవత్సరాలకు పైగానే జిల్లాలో నిమ్మసాగు చేపడుతున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో ఏటా నిమ్మ సాగు పెరుగుతోంది. అయినా ఉమ్మడి జిల్లా పరిధిలో దిగుబడి విక్రయించుకునేందుకు ఒక్క మార్కెట్ కూడా లేదు. ఆళ్లగడ్డలో మాత్రమే ప్రైవేటు మార్కెట్ (దళారీ) ఒక్కటి ఉంది. దీంతో అందరూ రైతులు అక్కడికే కాయలు తీసుకు వచ్చి వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది.

మూడేళ్లలో జిల్లాలో నిమ్మ సాగు (హెక్టార్లలో)

సంవత్సరం	సాగు విస్తీర్ణం
2020 - 21	1,682
2021 - 22	2,907
2022 - 23	3,555
2023 - 24	4,500

ఈ ఏడాది మార్కెట్‌లో నిమ్మ ధరలు (రూ..ల్లో)

నెల	బస్తా (40 కిలోలు)
జూలై	1,000 - 1,400
జూన్	4000 - 4,500
మే	6,500 - 7,100
ఏప్రిల్	5500 - 6,600
మార్చి	2,000 - 2,600
ఫిబ్రవరి	2,000 - 3,100

కొంటే ఒక్కటి రూ.5.. అమ్మితే కిలో రూ. 25

నిమ్మకాయ ఆన్‌లైన్ స్టోర్స్‌లో.. ఒక్కోటి రూ. 5 చొప్పున పలుకుతోంది. కూరగాయల మార్కెట్‌లలో కొనాలన్నా కిలో రూ. 70 పైనే ఉంది. వీటిని పండించే రైతుకు మాత్రం కిలోకు రూ. 25 మాత్రమే దక్కుతుంది. పది రోజుల కిత్రం కిలో రూ. 15 చొప్పునే ఇచ్చారు. కోత రవాణా ఖర్చులకే సరిపోతోందని అలాగని చెట్టుకే వదిలేయలేని పరిస్థితి ఏర్పడింది.

కోత కోస్తే నష్టమే.. అయినా

ఈ ఏడాది ఏప్రిల్‌లో బస్తా (40 కిలో) రూ.7 వేల వరకు పలకగా మే నెల వరకు బాగానే ఉన్న ధర క్రమంగా తగ్గుతూ వచ్చింది. మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా మే, జూన్‌లో కూడా ఎండలు మండిపోతున్నా బస్తా మేలు రకం నిమ్మకాయల ధర రూ.1,000 నుంచి రూ.1,400 కూడా పలకక పోవడంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నిమ్మకు ధర లేదన్నది కొనుగోలు దారుల మాట. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ లేదంటూ దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోయకపోతే.. తర్వాత కాపుపై ప్రభావం

ధరలు లేవని కాపు కోయకుండా చెట్టుకే వదిలేస్తే వచ్చే కాపు తగ్గుతుంది. పండిన కాయలు రాలి కిందపడినా ఇబ్బందే. ఆమ్లగుణం ఉండటంతో చెట్టు వేర్ల వ్యవస్థ దెబ్బతింటుంది. అందుకే వాటిని ఎప్పటికప్పుడు ఏరి పక్కన పడేయాలి. కూలీల ఖర్చు భరించి మార్కెట్ తరలించి దళారులు ఇచ్చిన కాడికి తీసుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా ధరలు పెద్దగా లేకపోవడంతో రైతులు నష్టపోయారు.

నాటి ధరలు ఉంటే గట్టెక్కేవాళ్లం



ఏడాది పొడువునా తోటను కంటికి రెప్పలా చూసుకుంటాం. ఏప్రిల్ నుంచి జూలై వరకు ధరలు బాగా పెరుగుతాయని ఆశ ఉంటుంది. ఈ మూడు నెలల్లోనే ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉటుంది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో ఉన్న ధరలు మే, జూన్‌లో కొనసాగి ఉంటే గట్టెక్కేవాళ్లం. సీజన్‌లో ధరలు పడిపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది. – బండి నాగభూషణం, మర్రిపల్లి, ఆళ్లగడ్డ మండలం

మార్కెట్ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. నేను ఐదు ఎకరాల్లో నిమ్మచెట్లు నాటాం. అయితే నిమ్మకాయల అమ్మకాలకు ఉమ్మడి జిల్లాలో మార్కెట్ సదుపాయం లేక పోవడం వల్లనే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మార్కెట్ సౌకర్యం ఉంటే సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉంది.
– క్రిష్టారెడ్డి, ఆర్. కృష్ణాపురం, ఆళ్లగడ్డ మండలం

మార్కెట్‌కు అనుకూలంగా కాపు నిలుపుకోవాలి



రైతులు అందరూ ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే నేరుగా మార్కెట్ వారితో అనుసంధానం చేసుకోవచ్చు. దీంతో దళారీ వ్యవస్థను పూర్తిగా అడ్డుకోవచ్చు. ఈ సంఘాలకు 75 శాతం సబ్సిడీ సౌకర్యంతో గోడౌన్ (కలెక్షన్ సెంటర్)లను నిర్మించుకోవచ్చు. అక్కడే గ్రేడింగ్ చేసుకుని నిల్వ చేసుకోవచ్చు. ధర లేనప్పుడు నిమ్మకాయలను పౌడర్ చేయడం, జూస్‌గా చేయడం, డ్రై చేసేందుకు అవసరమైన స్టీం చేయడం తదితర ఉప ఉత్పత్తులను తయారు చేసుకునే విధంగా అవసరమైన యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోంది. ముఖ్యంగా రైతులు మార్కెట్‌కు అనుకూలంగా సీజన్ బట్టి ఎప్పుడు కాపు వస్తే ధర ఉంటుందో అంచనా వేసుకొని పూత నిలుపుకోవడం మంచిది.
– నాగరాజు, జిల్లా ఉద్యానశాఖాధికారి

గెలివికాలనీలో రక్షణ కల్పించండి

- ఎస్పీని కోరిన కాలనీ వాసులు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇళ్ల ఆవరణలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని నంద్యాల పట్టణంలోని ఎస్పీజి కాలనీ సమీపంలోని గెలివికాలనీ వాసులు ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాయలంలో నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 110 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదులను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించామని, మరి కొన్ని ఆయా సెక్షన్ అధికారులకు రెఫర్ చేశామన్నా రు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- తన జేసీబీని కుమారుడు ఇతరులు విక్రయించాడని, వాహనాన్ని తిరిగి ఇప్పించాలని చిన్న మల్కాపురం సాలన్న ఎస్పీకి విన్నవించాడు.
- తన భర్త మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు తనకు సంబంధించిన ఆస్తి దస్తావేజులు తీసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని తనకు న్యాయం చేయాలని నంద్యాల పట్టణానికి చెందిన షేక్ నర్గీస్ ఎస్పీని కోరారు.

28న 'అమ్మ ఒడి' ప్రారంభం

- వచ్చే నెల 7 వరకు కార్యక్రమాలు

కర్నూలు సిటీ: జగనన్న అమ్మఒడి పథకాన్ని ఈ నెల 28వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారని డీఈఓ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఆదే రోజు కర్నూలు మండల పరిధిలోని మిలటరీ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో 'అమ్మ ఒడి' కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు.

యువ న్యాయవాదులకు భరోసా

- వైఎస్సార్ లా నేస్తాన్ని' సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- బటన్ నొక్కి న్యాయవాదుల ఖాతాల్లో నగదు జమ చేసిన సీఎం జగన్



యువ న్యాయవాదులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, హబీబుల్లా తదితరులు

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన యువ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం ద్వారా భరోసా కల్పిస్తుందని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్ ఆర్ లా నేస్తానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల నిధులను బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కారక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వృత్తిపరంగా యువ న్యాయవాదుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. జిల్లాలో అర్హులైన 399 మంది యువ న్యాయవాదులకు రూ.79,80,000 ఆర్థిక సహాయా న్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. నెలకు రూ.5 వేల చొప్పున 2023 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున జమ చేశారన్నారు. వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో నిలదొక్కుకునేంత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థికంగా ఆసరా కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును ఏర్పాటు చేసిందన్నారు. ఈ ట్రస్టు నుంచి న్యాయవాదుల అవసరాలకు రుణాలు, గ్రూపు మెడిక్లెయిమ్ పాలసీ, ఇతర అవసరాల కోసం రుణాలు ఇస్తుందన్నారు. అనంతరం యువ న్యాయవాదులకు కలెక్టర్, జెడ్పీ చైర్మన్ తదితరులు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ శేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ రామసుబ్బయ్య, పట్టణ వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, నూకా జగన్‌మోహన్‌రెడ్డి, ఓబులరెడ్డి, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లల్లో 'వెలుగులు'

- వృద్ధులకు మూడవ విడత కంటి పరీక్షలు
- సచివాలయాల పరిధిలో శిబిరాలు
- జిల్లాలో 1.50 లక్షల మందికి స్క్రీనింగ్
- 41 వేల మందికి కంటి అద్దాల సూచన
- ఆరు వేల మందికి ఆపరేషన్లు
- వృద్ధుల కంటిచూపు సమస్యలకు చెక్



రేవనూరులో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

జిల్లాలో కంటి వైద్య బృందాలు	15
నేత్ర పరీక్షలు చేయించుకున్న వృద్ధులు	1.50 లక్షలు
కళ్ల అద్దాలకు సూచించిన వృద్ధుల సంఖ్య	41,374
మందులతో చికిత్స పొందిన వారు	1.02 లక్షలు
ఆపరేషన్లు అవసరమైన వారు	6,530
సర్జరీలు చేయించుకున్న వృద్ధులు	4,817

కోవెలకుంట్ల: అరవై ఏళ్లు దాటిన వృద్ధులకు కంటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం సత్ఫలితాలనిస్తోంది. అవ్వాతాతలకు వైద్య పరీక్షలు నిర్వహించి డాక్టర్లు వారికి కంటి చూపునిస్తున్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా మొదటి రెండు విడతల్లో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించగా మూడవ విడతలో వృద్ధులకు అమలు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 15 ప్రత్యేక వైద్య బృందాలు ఏర్పాటు చేసి 1.50 లక్షల మంది వృద్ధులకు ఇప్పటి వరకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఆయా మండలాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేశారు. 60 ఏళ్లు దాటి కంటిచూపు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నవారి కష్టం తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కంటివెలుగు పథకాన్ని అమల్లోకి తెచ్చింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వృద్ధులు కంటిచూపు సమస్యలతో బాధపడుతూ వైద్యం, కంటి అద్దాలు, ఆపరేషన్లు చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అవ్వాతాతలకు అండగా నిలిచి వారి ఇళ్ల వద్దకే వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టింది. వృద్ధులకు వైద్య పరీక్షలు చేయడమేకా కుండా మందులు, కంటి అద్దాలు, ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తుండటంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామ సచివాలయాల పరిధిలో కంటి వైద్యులు, నర్సులు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో కూడిన బృందాలు పనిచేస్తున్నాయి. మూడవ విడతలో 1.70 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,50, 373 మంది వృద్ధులకు పరీక్షలు చేశారు. వీరిలో 41 వేల మంది కంటి అద్దాలు సూచించి ఇప్పటికే 29,981 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 6,530 మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 4,817 మంది ఆపరేషన్లు చేసి కంటి చూపునిచ్చారు. కంటి వెలుగు పథకం అవ్వాతాతల కంటి చూపుకు భరోసా ఇస్తుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

1500 మందికి స్క్రీనింగ్



పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 1,380 మందికి స్క్రీనింగ్ నిర్వహించాం. 661 మందికి కంటి అద్దాలు అవసరమైనట్లు గుర్తించాం. 129 మందికి ఆపరేషన్లు చేయాల్సి వస్తోంది. మిగిలిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి చుక్కల మందులు అందజేశాం. పీహెచ్‌సీ పరిధిలో 90 శాతం మందికి కంటి పరీక్షలు చేసే ప్రక్రియ పూర్తయింది.
– విద్యాసాగర్, డాక్టర్, రేవనూరు పీహెచ్‌సీ

కంటి సమస్యలు తీరాయి



ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకంతో అరవై సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి సమస్యలు తొలగిపోయాయి. ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు, ఆపరేషన్లు చేస్తుండటం మంచి కార్యక్రమం. ఇటీవలే నాకు కంటి పరీక్షలు చేసి చుక్కల మందు అందజేశారు.
– శ్రీనివాసులు, వృద్ధుడు, కోవెలకుంట్ల

రైల్వే పెండింగ్ పనులను పూర్తి చేయండి

- సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంను కోరిన మంత్రి బుగ్గన



రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

డోన్: తన సొంత నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎంతో కలిసిన మంత్రి బుగ్గన పలు కీలక పనులపై చర్చించారు. డోన్ రైల్వే జంక్షన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రెండవ టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ నడిబొడ్డున నంద్యాల, కర్నూలు రైల్వే గేట్ల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. జిందాల్ స్టీల్ నుంచి జిల్లాకు పెద్ద ఎత్తున ఖనిజ ఉత్పత్తులు జరుగుతుండటంతో పాణ్యం, సిమెంట్ నగర్‌లకు రెండవ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. బేతంచెర్ల, ఆర్‌ఎస్ రంగాపురం స్టేషన్‌లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ప్రైవేట్ పాఠశాలలో తనిఖీలు

మంత్రాలయం రూరల్: అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పుస్తకాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నారనే ఫిర్యాదు మేరకు మంత్రాలయంలోని జీనియస్ గ్లోబల్ ప్రైవేటు పాఠశాలలో మండల విద్యాధికారులు మోయినుద్దీన్, రాఘన్న తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ధరల పట్టిక, దుస్తుల రంగులు బోర్డులో అతికించలేదని పాఠశాల యాజమాన్యంపై ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి? తల్లిదండ్రుల నుంచి ఎందుకు అధికంగా ఫీజులు వసూలు చేశారో మూడురోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి పుస్తకాలను విక్రయించరాదని ఆదేశించారు.



ఇటీవల కురిసిన వర్షాలకు కర్నూలు సమీపంలోని నగరవనం సరికొత్త అందాలను అద్దుకుంది. పచ్చని వృక్షాలతో కనువిందు చేస్తోంది. చెరువులో బోటింగ్ మరచిపోలేని అనుభూతిని మిగుల్చుతోంది. వర్షిస్తున్న మేఘాలు ఒక వైపు.. పరచుకున్న పచ్చదనం ఇంకో వైపు.. నిండుకుండను తలపించే చెరువు మరోవైపు.. సోమవారం నగరవనంలో కనిపించిన సోయగమిది. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

ఉత్పాదకరంగంతో ఉజ్వల భవిష్యత్తు

- జేఎన్‌టీయూ వీసీ ఆచార్య జి.రంగ జనార్దన



స్నాతకోత్సవంలో విద్యార్థిని అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ జి.రంగ జనార్దన

కర్నూలు సిటీ: యువత కేవలం సేవా రంగంపై మొగ్గు చూపకుండా ఉత్పాదక రంగం వైపు అడుగులు వేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య జి.రంగ జనార్దన అన్నారు. చిన్న దేశాలైన తైవాన్, దక్షిణ కొరియా ఆర్థికంగా నిలదొక్కుకున్నాయంటే ఉత్పాదక రంగంలో సాధించిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని సోమవారం ఆ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు ఆర్థిక రంగంపై ఆధారపడి ఉంటుందన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. కర్నూలులో తమ విద్యాసంస్థలు డీమ్డ్ యూనివర్సిటీలకు ధీటుగా ప్లేస్మెంట్స్ సాధిస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు గట్టి భరోసా ఇస్తున్నాయన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులైన ప్రతి విద్యార్థి జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం బ్రాంచీల వారీగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. మొత్తం 489 మందికి పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాస రావు, కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై. పాండురంగయ్య పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ పిలుపు



కర్నూలులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

కర్నూలు : యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కర్నూలులో డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ వద్ద నుంచి కొండారెడ్డి బురుజు వరకు పోలీసులు, విద్యార్థులు కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, కోసిగి ప్రాంతాల్లో కూడా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డేపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను యువతకు, విద్యార్థులకు వివరిస్తూ పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 74 కళాశాలల వద్ద హోర్డింగ్స్, పోస్టర్స్‌ను ఏర్పాటు చేశారు. 20 కళాశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి కలిగి ఉన్నా, వాడినా, రవాణా చేసినా అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

- కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ డేపై సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో సీఐలు శంకరయ్య, శ్రీనివాసులు, శ్రీరామ్‌తో పాటు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో విద్యుత్ ఆపరేషన్స్ డివిజన్

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డివిజన్ కార్యాలయం ఎమ్మిగనూరులో ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆదోని పట్టణంలో ఉన్న కేంద్రం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే, వినియోగదాలకు మెరుగైన సేవలు అందించడం, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మిగనూరులో డివిజన్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా(సర్కిల్)లో ఐదు ఆపరేషన్స్ డివిజన్లు ఉండగా పశ్చిమ ప్రాంతం ఆదోని రెవెన్యూ డివిజన్‌లో ఒక్కటే ఉంది. పెద్ద డివిజన్ కావడం, జిల్లాలో ఆ డివిజన్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉండటాన్ని గుర్తించిన ప్రభుత్వం రెండుగా విభజించి సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో వేటిని ఎమ్మిగనూరులో కలిపి డివిజన్ ఏర్పాటు చేయాలనే విషయమై కసరత్తు కొనసాగుతోంది. కొత్త డివిజన్ ఏర్పాటైతే ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది ఇక్కడే ఉండనున్నారు. కోడుమూరు సమీపంలోని వేముగోడుతో పాటు ఎర్రబాడు.. సి.బెళగల్ సమీపంలో ఉన్న గ్రామస్తులు తమ పనుల నిమిత్తం ఆదోనిలోని ఈఈ కార్యాయానికి వెళ్లాల్సిన అవసరం ఇక మీదట తప్పుతుందని ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో మంత్రి బుగ్గన పర్యటన

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం నుంచి నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు పర్యటించనున్నారు. 27న కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని జిల్లా ఎస్పీ, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం నంద్యాల చేరుకొని అక్కడ వసతి గృహంలో జిల్లా కలెక్టర్, ఎంపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్‌తో సమావేశమవుతారు. 28న బేతంచెర్ల ఆటోనగర్‌కు భూమిపూజ చేస్తారు. ఆతర్వాత కేకే కొట్టాల గ్రామంలో ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఇదే మండలంలోని బిల్లల స్వర్గం గుహలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత బేతంచెర్లలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 29న ప్యాపిలి పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేసి, వసతిగృహం, పార్కుల నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం జరిగే యువజనుల సమావేశంలో పాల్గొంటారు. 30న మండలంలోని యు. కొత్తపల్లె గ్రామ సచివాలయం, ఆరోగ్యకేంద్ర భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం కొత్తకోట నుంచి కొత్తబురుజు వరకు పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన రోడ్డుపై పాదయాత్ర చేస్తారు. జూలై 1న డోన్ పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు భూమి పూజ చేయడంతో పాటు నూతన మునిసిపల్ పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విజయ డెయిరీలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు.

మాస్ మీడియా అధికారిగా ప్రమీలాదేవి



డెమో ప్రమీలమ్మకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని మాస్ మీడియా అధికారి(డెమో)గా ఎం. ప్రమీలాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ఆర్ జిల్లా కడపలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డెమోగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న ఆమెకు డిప్యూటీ డెమో చంద్రశేఖర్, హెచ్ఈవో శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ అభినందనలు తెలిపారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, క్షేత్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే చైర్మన్, సభ్యులు శ్రీశైలంచేరుకున్నారు. అలాగే ఈ సమావేశానికి శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరుకానున్నారు.

టైప్‌రైటింగ్‌లో కోసిగి విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్



పురందేశ్వరి

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పురందేశ్వరి అనే విద్యార్థిని టైప్ రైటింగ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ విద్యార్థిని ఫిబ్రవరిలో జూనియర్ గ్రేడ్ టైప్‌రైటింగ్ పరీక్ష రాయగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో 200 మార్కులకు గానూ 191 మార్కులు వచ్చాయి. విద్యార్థినిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, టైప్‌రైటింగ్‌లో శిక్షణ ఇచ్చిన కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కేశవరెడ్డి అభినందించారు.